మెనూ నిండా పోషకాలు

● జనం చూపు బలవర్ధక ఆహారం వైపు
● ఆరోగ్యబాటలో సంప్రదాయ వంటకాలపై దృష్టి
● నేటి నుంచి జాతీయ పోషకాహార వారోత్సవాలు

ఇటీవల కాలంలో ఆహారం విషయంలో ప్రజల దృష్టి మారింది. చాలా మంది ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకర జీవనశైలికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు తీసుకునే ప్రతి ఆహారంలో పోషకాలు ఉండేలా మెనూలో మార్పులు చేసుకుంటున్నారు. సెప్టెంబర్ మొదటి వారం జాతీయ పోషకాహార వారోత్సవం నేపథ్యంలో పోషకాహార ప్రాముఖ్యతపై ప్రత్యేక కథనం.


పోషకాలున్న ఆహారం

పిల్లల్లో ఉండాల్సిన బరువు, ఎత్తు

వయస్సు	ఎత్తు (సెం.మీ)	బరువు (కిలోలు)
పుట్టినప్పుడు	48.3	2.9
3 నెలలు	60.2	5.7
6 నెలలు	65.0	7.0
9 నెలలు	68.7	7.9
12 నెలలు	73.4	9.0
2 సంవత్సరాలు	84.2	11.5
3 సంవత్సరాలు	89.7	12.5
4 సంవత్సరాలు	96.2	14.9
5 సంవత్సరాలు	105.0	17.5

కర్నూలు(హాస్పిటల్): మనం ఏది తిన్నా అందులో నాలుగు పోషకాలుండాలన్న కాన్సెప్ట్ ప్రజల్లో పెరిగిపోయింది. ప్రజల ఆకాంక్షల మేరకు మార్కెట్‌లో నిత్యావసర సరుకుల కిట్లూ మారిపోయాయి. బియ్యం, కందిబేడలు, రవ్వలు, పప్పులతో పాటు తృణధాన్యాలైన కొర్రలు, అరికెలు, సామలు, అండుకొర్రలు, ఊదలు ఉంటున్నాయి. అలాగే చిరుతిళ్లల్లో భాగంగా ఆరగించడానికి బాదాములు, జీడిపప్పులు, కిస్‌మిస్‌లు, గసగసాలతో తయారు చేసిన చిరుతిళ్లను ఉంచుతున్నారు. పెద్ద పెద్ద మార్టులకు వెళ్లినా, చిన్న సూపర్‌మార్కెట్‌లకు వెళ్లినా ఇదే వరుస మనకు కనిపిస్తుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోషకాలను వెతికి మరీ పట్టుకుంటున్నారు. ఇదివరకులాగా ఆకలేస్తే పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి రెండు బంగాళదుంప చిప్స్ ప్యాకెట్లు లేదా బేకరికి వెళ్లి వేడి వేడి సమోసాలు తెచ్చుకుని తినడాన్ని తగ్గించేశారు. ఎక్కువ కాలంలో నిల్వ చేసిన, ప్రాసెస్డ్ ఫుడ్ తిని రోగాలు కొని తెచ్చుకునే బదులు అప్పటికప్పుడు ఇంట్లో తయారు చేసుకుని తింటే మేలని భావిస్తున్నారు.

తక్కువగా ఉప్పు, స్వీట్, కొవ్వులు

ఒకప్పుడు ఇంటికి స్వీట్ ప్యాకెట్ తీసుకొస్తే మరుసటి రోజు ఒక్కటి ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ ప్యాకెట్‌లో స్వీట్లు వారం రోజుల పాటు అలాగే ఉంటున్నాయి. జనానికి స్వీట్లపై మక్కువ తగ్గిపోయింది. ఒక వైపు షుగర్ రోగులు పెరిగిపోవడం, మరోవైపు స్వీట్లు ఎక్కువగా తింటే తమకూ భవిష్యత్‌లో షుగర్ వస్తుందేమోనన్న భయం, ఇంకో వైపు లావైపోతామన్న ఆందోళనతో వాటికి దూరంగా ఉంటున్నారు. ఇదే సమయంలో నూనెలో ఈతకొట్టి వచ్చిన సమోసాలు, ఆలూ బజ్జీలు కూడా అలా ముట్టి వదిలేస్తున్నారు. టిఫిన్‌లో పూరీలు, వడలు జోలికి వెళ్లే వారి సంఖ్య కూడా ఇటీవల గణనీయంగా తగ్గిపోయింది. శుభ్రంగా ఇడ్లీలు, నూనెలేని చపాతీలు, పొంగల్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏది తిన్నా అందులో ఉప్పు, నూనె తక్కువగా ఉండాలని ముందే చెబుతున్నారు.

సంప్రదాయ చిరుతిళ్లవైపు చూపు

మన అమ్మమ్మ, నాన్నన్నల కాలం నాటి వంటకాల వైపు జనం మళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి పిల్లలు రాగానే అందులో నుంచి జంతికలు, మురుకులు, కర్జికాయలు, అత్తరాసలు తీసి చేతికి ఇచ్చేవారు. అయితే, ఇప్పుడు ఇంట్లో వాటిని తయారు చేసే సమయం, మనుషులు లేరు కాబట్టి అవి చేసే దుకాణాల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి పిల్లలకు తినిపిస్తూ పెద్దలు ఆరగిస్తున్నారు. ఈ మేరకు కర్నూలు నగరంలోని పాతబస్తీతో పాటు గాంధీనగర్, సెంట్రల్ ప్లాజా, మద్దూర్‌నగర్, వెంకటరమణకాలని, నంద్యాల రోడ్డు తదితర ప్రాంతాల్లో సంప్రదాయ వంటకాలు విక్రయించే దుకాణాలు అధిక సంఖ్యలో వెలిశాయి.

పెద్దాసుపత్రిలో ఎన్‌ఆర్‌సీ

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఉన్న న్యూట్రిషియన్ రిహాబిటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ)కు ప్రతి సంవత్సరం 350 నుంచి 400 మంది ఓపీ రోగులు, 200 నుంచి 300 ఇన్‌పేషెంట్లుగా ఆరు నెలల నుంచి 60 నెలల చిన్నారుల వరకు చికిత్స పొందుతున్నారు. ఇక్కడ చేరే వారిలో అధికమంది పోషకాహారలోపంతో బాధపడే వారే ఉంటారు. వీరికి మందులతో పాటు అవసరమైన పోషకాహారాన్ని సమయానుసారంగా ఇవ్వడం ద్వారా రెండు, మూడు వారాల్లోనే పిల్లలు ఎత్తుకు తగిన బరువుతో ఇంటికి డిశ్చార్జ్ అయి వెళ్తున్నారు. పోషకాహారలోపం కారణంగానే చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి తక్కువై వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని, వారికి సరైన పోషకాహారాన్ని అందించాలని పిల్లల తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్నారు.

పిల్లలకు సమతుల ఆహారం ఇవ్వాలి



పోషకాహారలోపంతో పిల్లలకు తరచుగా ఇన్‌ఫెక్షన్లు సోకుతుంటాయి. వయస్సుకు తగ్గ బరువు ఉండకపోవడం లేదా అధిక బరువు ఉండటం, ఐరన్ లోపం వల్ల రక్తహీనత మొదలైన సమస్యలు అధికమవుతున్నాయి. వీటిని అధిగమించాలంటే ఆకుకూరలు, పండ్లు ఉన్న ఆహారాన్ని అలవాటు చేయాలి. ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లలకు మెత్తని ఆహారాన్ని, ఆ తర్వాత ఇంట్లో అందరూ ఏమి తింటారో వాటినే తినిపించాలి. అయితే వారికి సమతుల ఆహారాన్ని తప్పనిసరిగా ఇవ్వాలి.

–డాక్టర్ పి. రవీంద్రనాథ్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, చిన్నపిల్లల విభాగం, జీజీహెచ్, కర్నూలు

పోషకాలున్న ఆహారంతోనే ఆరోగ్యం



నోటికి రుచిగా ఉందని బయటి ఆహారాన్ని అతిగా తింటే దానివల్ల శరీరానికి కేలరీలు వస్తాయే గానీ పోషకాలు అందవు. పోషకాహారం లేకపోతే శరీరం వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోలేదు. పోషకాహారలోప సమస్య కారణంగానే మహిళలకు 30 ఏళ్లకే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వయస్సు ప్రకారం పోషకాహారాలు తీసుకుంటే సమస్యల నుంచి సాధ్యమైనంత వరకు బయటపడవచ్చు. అయితే, ప్రతి ఒక్కరూ తాము ఏమి తింటున్నాం, ఎంత తింటున్నామన్నది గుర్తించి తినడం అలవాటు చేసుకోవాలి.

–డాక్టర్ జి. రమాదేవి, పోషకాహార నిపుణురాలు, కర్నూలు

క్లుప్తంగా

పరిసరాల శుభ్రత పాటించాలి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సందీప్

సి.బెళగల్: ప్రతిఒక్కరూ బాధ్యతగా పరిసరాల శుభ్రత పాటించాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. మండలంలోని పలుకుదొడ్డి, సంగాల, గుండ్రేవులు, కొండాపురం, పల్‌దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

సన్మానం


శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని పాలకొలను గ్రామ వీఆర్‌ఓ శివప్రసాద్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు ఆయనను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ వెంకటరమణ, డీటీ సుదర్శనం, వీఆర్‌ఓల సంఘం నాయకులు శివప్రసాద్‌కు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తే బహుమానం

కోడుమూరు రూరల్: వినాయక చవితి సందర్భంగా కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహిస్తే రూ.5వేలు బహుమానం అందజేస్తానని కోడుమూరు సీఐ తబ్రేజ్ ప్రకటించారు. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల ప్రజలు వినాయక చవితి పర్వదినాన్ని సంతోషంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఉత్సవాలు సంప్రదాయంగా నిర్వహించుకోవాలని, గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, స్వామివార్ల విగ్రహాల ఊరేగింపులు ప్రశాంతంగా చేసుకోవాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు రూరల్ : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ సూచించారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉందని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదన్నారు. పాతమట్టి మిద్దెల్లో జీవించే ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితిని తట్టుకునేందుకు రెవెన్యూ సిబ్బంది సైతం అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

మహిళల భద్రత, అభివృద్ధిపై అవగాహన


మెమొంటో అందిస్తున్న అందజేస్తున్న లీలావతి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్టు వద్ద ఉన్న శాంతరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో బేటి బచావో..బేటి పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళల భద్రత, అభివృద్ధిపై అవగాహన సదస్సుకు సీడీపీఓ, జిల్లా నోడల్ అధికారి లీలావతి హాజరయ్యారు. ఆడపిల్లల రక్షణ, సమాజ పరిస్థితులు తదితర విషయాలను సీడీపీఓ వివరించారు. ప్రస్తుతం పరుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారని గుర్తు చేసిన ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ప్రభుత్వాలు మహిళల రక్షణకు అమలు చేస్తున్న చట్టాలని వివరించారు. మహిళా సాధికారత అంశంపై ప్రసంగించిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు.

ఆర్‌డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): భారీ వర్షాల నేపథ్యంలో కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఓ కార్యాలయంతోపాటు డివిజన్‌లోని అన్నిమండల కేంద్రాల్లో తహసీల్దార్ కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, వర్షాలతో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా, వర్షంలో ఇరుక్కొని ఇబ్బంది పడుతున్నా కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని సూచించారు. ఆర్‌డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో 6303756113, 9912069678 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

గ్రీన్‌కోకు భూములు ఇవ్వడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ, చుట్టు పక్కల గ్రామాల రైతులకు చెందిన భూములు సోలార్ పార్కు కోసం గ్రీన్‌కో సంస్థకు ఇవ్వడం అన్యాయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపు 2 వేల ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అదే జరిగితే సన్నా, చిన్నకారు రైతులు భూములు లేకుండా కూలీలుగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడ ఎకరం రూ.50 లక్షల విలువ చేస్తుందన్నారు.ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ మోదీన్‌బాషా తెలిపారు. 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి31 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ కింద జరిగిన వివిధ రకాల పనులపై తనిఖీ బృందం సభ్యులు ఆడిట్ నిర్వహిస్తున్నారన్నారు. సెప్టెంబరు 2వతేదీ నుంచి 6వతేదీ వరకు ఆయా గ్రామాల్లో తనిఖీ బృందం ఉపాధి పనులపై గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలో నివేదికలు చదివి విన్పిస్తారన్నారు. సెప్టెంబరు 12న కోడుమూరులో మండలంలో జరిగిన పనులపై బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని ఏపీఓ తెలియజేశారు.

నేడు ఇసుక బుకింగ్ ఉండదు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని గ్రామ సచివాలయం – 2లో జరుగుతున్న ఇసుక బుకింగ్ ఆదివారం ఉండదని బుక్కింగ్ పాయింట్ వీఆర్వో సాయిరమణ తెలిపారు. శనివారం 1,391 టన్నుల ఇసుక బకింగ్ అయినట్లు ఆయన తెలిపారు. 60 టిప్పర్లు, 56 ట్రాక్టర్లు ఇసుక తరలింపునకు నమోదు చేయించుకున్నారు.

శాంతిరామ్‌లో స్మార్ట్ ఇండియా హ్యాక్‌థన్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం స్మార్ట్ ఇండియా హ్యాక్‌థన్ –2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి స్మార్ట్ హ్యాక్‌థన్ 2024 విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించుకునే ఒక వేదిక అన్నారు. ఈ పోటీలో విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించి ప్రభుత్వం మరియు పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను సాంకేతికతో రూపొదించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీన్ అశోక్ కుమార్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి


పంట నమోదును పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి

ఓర్వకల్లు: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని జేడీఏ పీఎల్ వరలక్ష్మి సూచించారు. మండల కేంద్రం ఓర్వకల్లు వద్ద జరుగుతున్న పంట నమోదు కార్యాక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 11,433 ఎకరాలలో పంట నమోదు ప్రక్రియ పూర్తిచేసినట్లు ఏఓ సుధాకర్ తెలిపారు. అనంతరం జేడీఏ వరలక్ష్మి మాట్లాడుతూ ఈ ప్రక్రియ ఈ నెల 15వ తేదీలోగ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ– క్రాప్ నమోదు ఆధారంగానే వ్యవసాయ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను కూడా నమోదు చేయాలని తెలిపారు. పంట నమోదుకు రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఏడీఏ దస్తగిరిరెడ్డి, ఏఓ సుధాకర్, ఏఈఓలు భాస్కర్, మధు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వర్క్ షాపును జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

ఓర్వకల్లు: విజయవాడలో ఈ నెల 3,4,5 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వర్క్ షాపును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగం విలయతాండవం చేస్తుందన్నారు. పాలకులు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని విమర్శించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బీసన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, మండల నాయకులు అఖిల్, మహబూబ్‌వలి, జయన్న, బాలమద్దిలేటి, శ్రీధర్, బాష తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపివ్వని వర్షం

● పొంగిన వాగులు, వంకలు
● నీట మునిగిన పంటలు


గడివేములలో నీట మునిగిన మిరప పంట

గడివేముల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి గడివేముల మండలంలో నిరంతరాయంగా రెండురోజు వర్షం కురవలేదు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు నీట మునగాయి. మండలంలో 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ వర్గాలు తెలిపారు. గడివేములలో మిరప పంటలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రైతులు నీటిని లోతట్టు ప్రాంతాలకు వదులుతున్నారు.

కల్లూరు: కల్లూరు మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. కల్లూరు అర్బన్ కాలనీలో రోడ్లని జలమయం అయ్యాయి. మండల వ్యాప్తంగా 34.6 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.


దిన్నెదేవరపాడు రోడ్డులో నిలిచిన వర్షం నీరు

ఏఈ... జాడేది !



పాణ్యం సబ్‌స్టేషన్

పాణ్యం: నియోజకవర్గ కేంద్రం పాణ్యం ట్రాన్స్‌కో ఏఈ రెండు నెలలుగా ప్రజలకు అందుబాటులో లేరు. పనుల్లో తీవ్ర జాప్యం, అత్యవసర సమయాల్లో సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏఈ బాధ్యతలు సబ్ ఇంజినీర్‌కు అప్పగించినా పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలు అందడం లేదు. రైల్వే డబుల్‌లైన్ పనుల్లో భాగంగా విద్యుత్ కోతలు, స్తంభాలు పడిపోవడంతో పాణ్యంలో విద్యుత్ కోతలు పెరిగిపోయాయి. కనీస సమాచారం అందజేసే నాథుడు కరువయ్యారు. దీంతో ఏఈ జాడ ఏదీ అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

రెండు నెలల నుంచి పాణ్యం ఏఈ సెలవుల్లో వెళ్లిగా ఆయన స్థానంలో మరో ఏఈ లేదా ఇన్‌చార్జ్‌ని నియమించాల్సి ఉంది. ఉన్నతాధికారులు రెండు వారాలకోసారి తనిఖీ చేయడం తప్పా చేసిందేమీ లేదు. ఏఈ సమస్యను పరిష్కరించాలనే ఆలోచనే కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అయితే సెలవుల్లో వెళ్లిన ఏఈపై అనేక ఆరోపణల కారణంగా ఎవ్వరికీ పోస్టింగ్ ఇవ్వలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కనెక్షన్లకు అక్రమంగా వసూళ్లు చేశారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సైతం విచారణ చేసినట్లు సమాచారం. సమస్యను డీఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సెలవులు ముగిసినా ఏఈ విధులకు హాజరుకాలేదని సమాచారం అందిందని, పూర్తిస్థాయిలో విచారిస్తాం అన్నారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

● లబ్ధిదారులకు పింఛన్ అందజేసిన సెర్ప్ సీఈఓ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే


వృద్ధురాలికి నగదు అందజేస్తున్న వీరపాండియన్, రంజిత్‌బాషా, గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు: సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా శనివారం చేపట్టాల్సిన పింఛన్ పంపిణీ కార్యక్రమం అధికార యంత్రాంగంలో టెన్షన్ పుట్టించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా శుక్రవారం రాత్రి అనుకోకుండా ఓర్వకల్లు గ్రామానికి మార్పు చేశారు. దీంతో రాత్రికిరాత్రి అధికారులు ఓర్వకల్లుకు పరుగులుదీశారు. చకచకా ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. చివరకు సీఎం పర్యటన రద్దయినట్లు సీఎం క్యాంపు కార్యాలయం నుంచి సమాచారం రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎట్టకేలకు సెర్ప్ సీఈఓ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో కలిసి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పింఛన్ల పంపిణీని చేశారు. కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ శివనాగప్రసాద్, స్థానిక నాయకులు లక్ష్మీకాంతారెడ్డి, రాంభూపాల్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో అధికారులు పింఛన్ పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 6,335మంది పింఛన్‌దారులు ఉండగా సాయంత్రానికి 6,069మందికి అందజేసినట్లు అధికారులు తెలిపారు.

అస్తవ్యస్తంగా పింఛన్ల పంపిణీ

కోడుమూరు రూరల్ : ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం ఒక రోజు ముందుగానే శనివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినప్పటికి సర్వర్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లబ్ధిదారుల వేలిముద్రలు, ఐరీష్ పడక కొద్దిసేపు, సర్వర్ సమస్యతో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. దీంతో లబ్ధిదారులతో పాటు, పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఒకే చోటే పింఛన్ల పంపిణీ

పింఛన్ల పంపిణీలో భాగంగా సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లకుండా ఒకే చోట కూర్చొని పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పింఛన్ పంపిణీని ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు.

కల్లూరు: కల్లూరు మండల గ్రామీణ ప్రాంతంలోని వివిధ రకాల పింఛన్ లబ్ధి దారులు మొత్తం 6,067 మంది ఉండగా శనివారం సాయంత్రం నాటికి 97.86 శాతం మందికి నగదు అందించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్‌దారుల వద్దకు వెళ్లి పంపిణీ చేసినట్లు తెలిపారు.

సి.బెళగల్ : మండలంలోని గ్రామాలలో శనివారం 6,838 మంది పింఛన్ దారులకు నగదును పంపిణీ చేయడంతో మండలంలో 95 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. ఉదయం సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు.

గడివేముల: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర పింఛన్లను శనివారం ఉద్యోగులు లబ్ధిదారుల వద్దకు చేరుకుని నగదు అందజేశారు. మండలంలో 5,743 పింఛన్లకు గాను 5,274 పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

సీఎం పర్యటన కబురు... బాగుపడిన రోడ్డు


సీసీ రోడ్డుపై గుంతలు పూడిన దృశ్యం

ఓర్వకల్లు: సీఎం చంద్రబాబు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు రానుండడంతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం పర్యటన రద్దు అయినప్పటికీ చిద్రమైన ప్రధాన రోడ్డు కొతమేర బాగుపడింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి మర్రిచెట్టు వరకు వేసిన సీసీ రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ఛిద్రమై, గుంతలు ఏర్పడడంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చేది. సీసీ రోడ్డుపై చిప్స్‌తో గుంతలను పూడ్చివేశారు. సమయంలేక పోవడంతో అర్ధాంతరంగా వదిలేసినప్పటికీ సీఎం పర్యటన కబురు రోడ్డు బాగుపడిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రమాదకరంగా ఓవర్‌హెడ్ ట్యాంకు


ప్రమాదకరంగా ఓవర్‌హెడ్‌ట్యాంకు

గడివేముల: అప్పుడెప్పుడో నాలుగు దశాబ్దాల క్రిందట నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు అది. మండల కేంద్రమైన గడివేముల ప్రజలకు తాగు నీరందిస్తున్న ట్యాంకు. సాధారణంగా ట్యాంకు నిర్మించిన 20 ఏళ్ల వరకు మాత్రమే వాడాలి. అలాంటిది గడివేముల గ్రామంలోని బోల్లవరం రస్తాలో ఉన్న ట్యాంకు 40 ఏళ్లు గడుస్తున్నా నేటికి నీటిని సరఫరా చేస్తూనే ఉన్నారు. 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న మంచినీటి ట్యాంకు ఉన్న నాలుగు పిల్లర్ల కడ్డీలు తేలాయి. కూలడానికి సిద్ధంగా ప్రమాదరకంగా ఉన్నట్లుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్యాంకు కూల్చి కొత్తది నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ట్యాంకు పిల్లర్లకు కడ్డీలు బయటపడిన దృశ్యం

కర్నూలు ఏఓపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదు

● విశ్వనాథ్‌ను విజిలెన్స్ ఏఓగా నియమిస్తే వేధింపులు పెరుగుతాయి
● కొందరు ఇన్‌పుట్ డీలర్ల ఫిర్యాదు
● ఒకటి రెండు రోజుల్లో విచారణ చేయనున్న జిల్లా వ్యవసాయ అధికారి

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లింది. కర్నూలు మండల వ్యవసాయ అధికారిగా విశ్వనాథ్ ఆరేళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ కార్యాలయ ఏఓగా డిప్యుటేషన్‌పై వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై కొందరు ఇన్‌పుట్ డీలర్లు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. కల్లూరు పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలు కర్నూలు ఏఓ పరిధిలో ఉన్నప్పుడు రకరకాలుగా వేధింపులకు పాల్పడ్డారని, ఈయన కారణంగా ఇక్కడి నుంచి కొన్ని కంపెనీలు వెళ్లిపోయాయని, కొన్ని కంపెనీలు కర్నూలుకు రావాల్సి ఉండగా ఆగిపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన విజిలెన్స్ ఏఓగా వస్తే వేధింపులు, ముడుపుల వ్యవహారం కొనసాగే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి రిపోర్టు ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయం జిల్లా వ్యవసాయ అధికారిణి పీఎల్ వరలక్ష్మిని ఆదేశించింది. సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసిన డీలర్లు, కొందరు రైతులు జిల్లా వ్యవసాయ అధికారిణికి కూడా ఏఓ విశ్వనాథ్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో ఆమె విచారణ జరపనున్నారు.

నగర పాలక ఇన్‌చార్జ్ కమిషనర్ బదిలీ

కర్నూలు (టౌన్): నగర పాలక అదనపు కమిషనర్, ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వి.రామలింగేశ్వర్ బదిలీ అయ్యారు. వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా ఆయనను బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు.